క్లుప్తంగా

వైభవంగా దుర్గాలమ్మ జాతర


ప్రత్యేక అలంకరణలో దుర్గాలమ్మ అమ్మవారు

మాడుగుల రూరల్ : ఎం.కోడూరు గ్రామములో గల దుర్గాలమ్మ పండగ గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 21 వ తేదీ నుంచి అమ్మవారి పండగ చాటింపు, ఘటాలు ప్రారంభించారు. గురువారం పండగ(జాతర) సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా ఆలంకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ ప్రజా ప్రతినిధులు, ప్రజలు, భక్తులు, పెద్ద సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు ఘటాలుతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం వద్ద దాతల సహకారంతో ప్రసాదం పంపిణీ చేశారు. సాయంత్రం కోలాటాలు, తప్పెటగుళ్లు, థింసా ఆదివాసి నృత్యం, కాంతార శక్తి వేషాలు, ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బండ్ల వేషాలు, బాణా సంచాతో పాటు హైదరాబాదు వారి సురభి సంస్థ ఆధ్వర్యంలో పాతాళ భైరవి నాటకం ప్రదర్శించారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ సత్యవతి

కె.కోటపాడు : పారిశుధ్యం, పరిశుభ్రత మెరుగు పర్చుకోవడం ద్వారా మంచి ఆరోగ్యం కలగనున్నట్టు ఏపీ మహిళా సాధికారిత జిల్లా కోఆర్డినేటర్ సత్యవతి అన్నారు. కె.కోటపాడు వెలుగు కార్యాలయంలో వీఏవో, సీసీలతో నీరు, పారిశుధ్యం, పరిశుభ్రతపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ ప్రతి కుటుంబం వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకోవాలని, ఆరుబయట మలవిసర్జనకు దూరంగా ఉండాలని కోరారు. సురక్షిత మంచినీటి వాడకం, ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. దోమల నివారణ ద్వారా మలేరియా, డెంగ్యూ వ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకటలక్ష్మి, డీఆర్‌డీఏ హెచ్.డి వాష్ కోఆర్డినేటర్ పద్మావతి, స్త్రీనిధి స్టేట్ డైరక్టర్ బి.జయలక్ష్మి, సీసీలు పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలతో రాజకీయంగా వేధిస్తున్నారు

వీఆర్పీ శ్రీను ఆవేదన

కె.కోటపాడు : లంకవానిపాలెం గ్రామంలో వీఆర్పీగా ఉద్యోగ భాద్యతలను నిర్వహిస్తున్న తనపై గ్రామానికి చెందిన కొందరు నాయకులు రాజకీయ కక్షతో తప్పుడు ఆరోపణలు చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు వీఆర్పీ పెనగంటి శ్రీను తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కొందరు టీడీపీ నాయకుల తీరుతో తాను మనస్తాపం చెందానని చెప్పారు. ఉద్యోగ నిర్వహణలో తప్పు చేస్తే గ్రామస్థాయిలోనే తనను దండించాలి తప్ప, ఇటువంటి తప్పుడు ఫిర్యాదులు ఉన్నతాధికారులకు చేయరాదని ఆవేదనతో ఆయన పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు

కె.,కోటపాడు : కూండ్రపువానిపాలెంలో గల సత్యసాయి మందిరంలో గురువారం సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో మహిళలు కుంకుమ పూజలను జరిపారు. శ్రావణమాసం గురువారం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని సాయిలక్ష్మి కుంకుమ పూజల కార్యక్రమాన్ని జరిపినట్లు సేవాసంస్థల జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు, మండల అధ్యక్షుడు కన్నూరు సూర్యనారాయణ, సమితి కన్వీనర్ బండారు నారాయణపాత్రుడు తెలిపారు. నిరంతర భగవన్నామ స్మరణతో భగవంతుడి కృప పొందాలని కశిరెడ్డి అప్పలనాయుడు, అనకాపల్లి జిల్లా ఆధ్యాత్మిక సమన్వయకర్త సాయిలక్ష్మి పేర్కొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

దేవరాపల్లి: ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న యూరియాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి అన్నారు. ఈ మేరకు ఎ.కొత్తపల్లి రైతు భరోసా కేంద్రంలోకి అందుబాటులోకి వచ్చిన యూరియాను గురువారం ఆమె చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఖరీఫ్ వరి, చెరకు ఇతర పంటలు సాగు చేస్తున్న రైతులకు ప్రస్తుతం యూరియా బాగా ఉపయోగపడుతుందన్నారు. రైతుల డిమాండ్ మేరకు అవసరమైతే అదనంగా యూరియాను రప్పించాలని ఆమె వ్యవసాయ అధికారులకు సూచించారు.

బాబోయ్..ఇవేం రోడ్లు

- అధ్వానంగా గ్రామీణ రహదారులు
- ఇక్కట్లు పడుతున్న విద్యార్థులు, ఉద్యోగులు, వాహన చోదకులు
- పట్టించుకోని అధికారులు


గోతులమయంగా గిరిజన గ్రామాల ప్రధాన రహదారి బీబీ పట్నం - వడ్డిప రోడ్డు


అధ్వానంగా ఉన్న రోలుగుంట ప్రధాన రహదారి

రోలుగుంట : ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రం రోలుగుంటతో పాటు వడ్డిప, బీబీ పట్నం, రత్నంపేట, ఎంకె.పట్నం తదితర గ్రామాల రహదారు దెబ్బతిన్నాయి. ఈ రహదారుల్లో ఉన్న గోతులు రోజురోజుకు భారీగా పెరగడంతో ఈ దారిలో ప్రయాణాలు చేసే వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శివారు గ్రామాల నుంచి హైస్కూళ్లు ఉన్న బుచ్చింపేట, కొంతలం, రోలుగుంట తదితర గ్రామాల్లో గల పాఠశాలలకు వచ్చే విద్యార్థులు, సచివాలయాలకు, పాఠశాలలకు వచ్చే విద్యార్థులు , ఆటోవాలాలు పడుతున్న ఇక్కట్లు వర్ణణాతీతం. మండలం కేంద్రం రోలుగుంటలో మండల కార్యాలయాల సముదాయం కూడలి నుంచి స్థానిక ఎంపీపీ పాఠశాల వరకూ దెబ్బతిన్న రోడ్డు బురదమయంగా మారింది. ఈ రోడ్డులో ప్రయాణం చేయాలంటే నరకాన్ని తలపిస్తోందని ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం (కూటమి ప్రభుత్వం) ఏర్పడి సుమారు మూడు నెలలు దాటినా చోద్యం చూస్తున్నారేగాని నాయకుల్లో గాని, ఉద్యోగుల్లో కాని చలనం లేదని విద్యార్థులు, ఉద్యోగులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే సమస్యపై దృష్టి సారించి దెబ్బతిన్న రహదారుల మెరుగుకు చర్యలు తీసుకోవాలని అన్ని వర్గాల వారు కోరుతున్నారు.

దివ్యాంగులు క్రీడల్లోనూ రాణించాలి


విజేతకు బహుమతి ప్రదానం

చోడవరం రూరల్ : దివ్యాంగ బాలబాలికలు క్రీడల్లో రాణించాలని, అలాంటి వారికి క్రీడా భారతి సహాయ సహకారాలు అందిస్తుందని ఒలంపియన్ పి.మాణిక్యాలరావు అన్నారు. స్థానిక ప్రేమసమాజంలో దివ్యాంగులకు వడ్డాదికి చెందిన వి.ఎస్.ఎన్ సేవాసంస్థ క్రీడాపోటీలను నిర్వహించి, గురువారం విజేతలకు బహుమతి ప్రదానం చేసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన దివ్యాంగ క్రీడాకారులు దీక్షాపట్టుదలతో అడుగేస్తే ఏదైనా సాధించగలరని ఆకాంక్షించారు. విశ్రాంత ఉప కులపతి ముర్రు ముత్యాలునాయుడు మాట్లాడుతూ క్రీడలు శారీరక ధృఢత్వానికే కాదు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయన్నారు. క్రీడాభారతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాలరావు మాట్లాడుతూ బహుమతుల కోసమే క్రీడల్లో పాల్గొనరాదని, అది అభ్యసనగా మారాలన్నారు. వి.ఎస్.ఎన్ సంస్థ సత్యారావు, ఆర్క్ సంస్థ కార్యదర్శి డి.ఎస్. ప్రసాద్, ప్రేమసమాజం ప్రసాదరాజు మాట్లాడారు. విజేతలైన దివ్యాంగులకు బహుమతులు, జ్ఞాపికలను ప్రదానం చేశారు.

గంధవరంలో ఆరోగ్య అవగాహన

చోడవరం రూరల్: మండలంలోని గంధవరం గ్రామంలో గురువారం అడిల్సెంట్ ఫ్రెండ్లీ హెల్త్ క్లినిక్‌ను నిర్వహించారు. గవరవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో రాష్ట్రీయ కిశోర స్వాస్థ్య (ఆర్‌కెఎస్‌కె)లో భాగంగా గ్రామంలో విఘ్నేశ్వరాలయ ప్రాంగణం వద్ద కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆడపిల్లల వివాహ వయసు కనీసం18 సంవత్సరాలు నిండాలని స్పష్టం చేశారు. చిన్న వయసులో వివాహం వల్ల రక్తహీనత, గుర్రపువాతం, రక్తస్రావం , నెలలు నిండకుండానే ప్రసవం, తక్కువ బరువుతో పిల్లల జననం, వారిలో ఎదుగుదల లోపం వంటి పలు సమస్యలను ఎదుర్కోవలసి వస్తుందని ఆరోగ్య సిబ్బంది హెచ్చరించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవలసిన ఆరోగ్య నియమ, నిబంధనలను తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ పి.రవికుమార్, ఎంఎల్‌హెచ్‌పీ కె.శ్రీలక్ష్మి, మహిళా పోలీస్ కె.శిరీష మాట్లాడుతూ బాల్య వివాహాలపై చట్టపరమైన చర్యలను వివరించారు. ఏఎన్ఎం ఎన్.చిట్టెమ్మ, ఆశా కార్యకర్త లక్ష్మి పాల్గొన్నారు.

రోగులకు పాలు, పండ్లు పంపిణీ


ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు అందిస్తున్న అచ్చింనాయుడు, వైద్యాధికారి రమ

కె.కోటపాడు : సామాజిక బాధ్యతతోనే సేవా కార్యక్రమాలను డేన్ ఫౌండేషన్ ద్వారా చేపడుతున్నట్టు ఆ సంస్థ చైర్మన్ దొగ్గ అచ్చింనాయుడు అన్నారు. కె.కోటపాడు సీహెచ్‌సీలో రోగులకు గురువారం తన పుట్టినరోజు సందర్భంగా పాలు, పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. ప్రతి ఏడాదిలాగానే పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, ఉచిత వైద్య శిబిరాలతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు డేన్ ఫౌండేషన్ ద్వారా పూర్తి సహకారాన్ని అందిస్తున్నట్టు అచ్చింనాయుడు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు ఆర్.రమ పాల్గొన్నారు.

ఘనంగా మరిడమ్మ పండగ


అమ్మవారి దర్శనం కోసం వెళ్తున్న భక్తులు

బుచ్చెయ్యపేట : బంగారుమెట్ట, ఎల్.బి పురం గ్రామ దేవత మరిడిమాంబ పండగను భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రెండు గ్రామాల ప్రజలు కలిసి అమ్మవారి పండగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గురువారం రెండు గ్రామాల నాయకులు పార్టీలకు అతీతంగా తమ కుటుంబ సభ్యులతో కలిసి పొలాల్లో వెలిసిన మరిడిమాంబ గుడికెళ్లి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ,చీర,జాకెట్టు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చికున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండాలని,పశువులకు తమ కుటుంబ సభ్యులకు ఎటువంటి అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలని రైతులు పూజలు చేశారు.

మాడుగుల ఎస్ఐ దామోదర్‌నాయుడు బదిలీ

మాడుగుల రూరల్ : మాడుగుల ఎస్ఐ పి. దామోదర్‌నాయుడుకు బదిలీ అయింది. ఆయనను మాకవరపాలెం పోలీసు స్టేషన్‌కు బదిలీ చేస్తు జిల్లా ఎస్పీ ఎం. దీపిక ఉత్తర్వులు జారీ చేసారు. ఆయన స్థానంలో చీడికాడ ఎస్ఐ జి.నారాయణరావును మాడుగుల ఎస్ఐగా నియమించారు. దామోదర్‌నాయుడు 2022 జూలైలో విధుల్లో చేరారు.

మాకవరపాలెం: ఎస్ఐగా దామోదర్‌నాయుడును నియమించారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న రామకృష్ణారావు స్థానంలో వి.మాడుగులలో పనిచేస్తున్న దామోదర్‌నాయుడును మాకవరపాలెంలో నియమిస్తూ ఎస్పీ దీపిక ఉత్తర్వులు ఇచ్చారు. ఆయన విధుల్లో చేరాల్సిఉంది.

ఐయితంపూడి ఎస్ఎంసీ చైర్‌పర్సన్‌గా సరస్వతి


ఎస్ఎంసీ ఎన్నికల్లో విజయం సాధించిన సరస్వతి,జ్యోతి

బుచ్చెయ్యపేట : ఐయితంపూడి స్కూల్ కమిటీ చైర్మెన్‌గా ఐయితరెడ్డి సరస్వతి(వైఎస్సార్) ఎన్నికయ్యారు. ఈ పాఠశాలలో ఎస్ఎంసీ చైర్మన్ పదవికి గ్రామ టీడీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు పోటీ పడడంతో పాఠశాలలో బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించారు. బ్యాలెట్ ఎన్నికల్లో ప్రత్యర్థిపై సరస్వతి రెండు ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 17వ తేదీన స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్(ఎస్ఎంసీ) ఎన్నికలు జరిగాయి. అదేరోజు ఈ పాఠశాలలో చైర్మన్ పదవి కోసం ఇరు పార్టీల నాయకులు పోటీ పడి గొడవలకు దిగడంతో అధికారులు ఎన్నికలను వాయిదా వేశారు. నిలిచిపోయిన ఎన్నికను గురువారం పాఠశాలలో నిర్వహించారు. హెచ్ఎం కె.శ్రీనివాసరావు ఎన్నికలను చేతులెత్తే పద్ధతిలో నిర్వహించాలని చూశారు. అయితే దీనివల్ల గ్రామంలో కక్షలు పెరుగుతాయని, బ్యాలెట్ పద్ధతిలోనే జరపాలని పలువురు కోరగా, బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించారు. పాఠశాలలో మొత్తం 33 మంది విద్యార్థులుండగా ఐదు తరగతులకు 15 మంది మెంబర్లను నియమించారు. ఒక మెంబర్ ఎన్నికలో పాల్గొనకపోగా 8 మంది సరస్వతికి ఓట్లు వేశారు. ప్రత్యర్థి ఐయితరెడ్డి నూకరాజుకి ఆరుగురు ఓటు వేశారు. దీంతో 2 ఓట్లు ఆధిక్యంతో సరస్వతి ఎన్నికైనట్లు హెచ్ఎం ప్రకటించారు. వైస్ చైర్మెన్‌గా కొమ్ము జ్యోతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

తార సంస్థ భవనాన్ని పరిశీలించిన ఆర్డీవో

మాకవరపాలెం: తార స్వచ్ఛంద సంస్థ భవనాన్ని నర్సీపట్నం ఆర్డీవో జయరాం పరిశీలించారు. మండల కేంద్రంలో ఉన్న తార సంస్థ కొన్నేళ్లుగా మూతపడింది. ఈ నేపథ్యంలో ఈ భవనాన్ని సంస్థ యాజమాన్యం ఏదైనా ప్రభుత్వ అవసరాలకు వినియోగించాలని అప్పగించింది. ఈ నేపథ్యంలో సుమారు 28 సెంట్లు ఉన్న ఈ స్థలంలో కళ్యాణ మండపం నిర్మించనున్నట్టు ఇటీవల స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెల్లడించారు. వెంటనే ఆ భవనాన్ని స్వాధీనం చేసుకోవాలని ఆర్డీవోకు ఆదేశాలివ్వడంతో గురువారం ఆయన ఈ భవనాన్ని సందర్శించి స్థానిక రెవెన్యూ సిబ్బందితో మాట్లాడారు. ఆయన వెంట సర్వే అధికారులతోపాటు ఆర్ఐ జెట్టి, వీఆర్వో సూర్యనారాయణ ఉన్నారు.

శిథిలమైన గురుకుల భవనాల కూల్చివేతకు వేలం


వేలంపాట దక్కించుకున్న శ్రీనివాసరావుకు ఆర్డర్ కాపీని అందిస్తున్న డీసీవో రూపావతి

దేవరాపల్లి : మండలంలోని తెనుగుపూడి డా. బిఆర్. అంబేడ్కర్ బాలుర గురుకుల విద్యాలయంలో శిథిలావస్థకు చేరిన భవనాలు కూల్చివేతకు బహిరంగ వేలం పాట ప్రక్రియను గురువారం నిర్వహించారు. ఉమ్మడి విశాఖ గురుకుల విద్యాలయాల కోఆర్డినేటర్ ఎస్. రూపావతి ఆధ్వర్యంలో పోలీసుల పర్యవేక్షణలో జరిగిన వేలం పాటలో 23 మంది పాటదారులు పాల్గొన్నారు. విశాఖపట్నం దొండపర్తికి చెందిన వై.శ్రీనివాసరావు రూ. 1,90,500కు వేలం పాటను దక్కించుకున్నారు. ఈ మేరకు వేలందక్కించుకున్న వ్యక్తికి వర్క్ ఆర్డర్‌ను డీసీవో రూపావతి అందజేశారు. వారంలోగా సగం మేర వేలం పాట సొమ్మును చెల్లించి పనులు ప్రారంభించి, నెల రోజుల్లోగా పూర్తి చేయాలని డీసీవో సూచించారు. గురుకుల విద్యాలయంలో శిథిలావస్థకు చేరుకొని ప్రమాదకరంగా మారడంతో ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా ఈ భవనాల తొలగింపునకు వేలంపాటలను నిర్వహించినట్టు డీసీవో తెలిపారు.

రేపు సామాజిక పింఛన్ల పంపిణీ

దేవరాపల్లి : ప్రభుత్వం అందించే సెప్టెంబర్ నెల ఫించన్ల సొమ్మును ఈ నెల 31న పంపిణీ చేయనున్నట్టు స్థానిక ఎంపీడీవో కె.చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఒకటో తేదీ ఆదివారం కావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఆయన స్పష్టం చేశారు. అన్ని పంచాయతీల్లో పింఛనుదార్లంతా 31 తెల్లవారజాము నుంచి ఇంటి వద్ద అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 31న దాదాపుగా 100 శాతం పింఛను పంపిణీని పూర్తి చేయాలని, ఎక్కడైనా మిగిలి ఉన్న వారికి సెప్టెంబర్ 2న అందజేయాలని అధికారులకు సూచించామని ఆయన స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే 30న ఫించన్ సొమ్మును విత్‌డ్రా చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

మాడుగుల రూరల్: ఎన్టీఆర్ భరోసా పింఛను సొమ్ము ఆగస్టు నెలకు సంబంధించి ఈ నెల 31వ తేదీ, సెప్టెంబర్ 2వ తేదీన పంపిణీ చేయాలని ఇన్‌ఛార్జి ఎంపీడీవో జి.వి.ఎస్. గోపాలరావు గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. సెప్టెంబరు 1 వ తేదీ ఆదివారం సెలవు దినం కావడం వల్ల ఈ నెల 31 ఉదయం 6 గంటల నుంచి సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు. మండలంలో 11,767 మందికి రూ 5,11,29,500 నగదు మంజూరు అయిందన్నారు. అలాగే చీడికాడ మండలం 13 సచివాలయాలకు సంబంధించి 8,701 మంది పింఛనుదార్లకు రూ.3,60,50,000 ఈనెల 31వ తేదీ, వచ్చే నెల 2 తేదీన పంపిణీ చేయాలని ఎంపీడీవో ఎ.జయప్రకాశరావు తెలిపారు.

తెలుగు భాష అమృత సమానం

- పాఠశాలల్లో తెలుగు భాష, క్రీడా దినోత్సవాలు
- గిడుగు, ధ్యాన్‌చంద్‌కు ఘన నివాళులు



కె.కోటపాడు హైస్కూల్లో గిడుగు చిత్రపటానికి పూలమాల వేసిన హెచ్ఎం పద్మావతి


ఎ.కొత్తపల్లిలో హైస్కూల్లో గిడుగుచిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హెచ్ఎం స్వర్ణలత


రామమూర్తి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న శివశంకర్ తదితరులు


విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న డీసీసీబీ మాజీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి


అవంతి కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మోహన్‌రావు


చీడికాడ గ్రంథాలయంలో గిడుగు రామమూర్తి చిత్రపటం వద్ద నివాళులు


తెలుగుదనం ఉట్టిపడేలా తురకలపూడి పాఠశాలలో విద్యార్థుల వేషధారణ


తెలుగు అక్షరాలతో నేతవానిపాలెం పాఠశాల విద్యార్థులు


కొంతలం జెడ్పీ హైస్కూల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు


తెలుగు అక్షరాలు పలకల మీద ప్రదర్శిస్తున్న ముకుందపురం పాఠశాల విద్యార్థులు

దేవరాపల్లి : అమృతం లాంటి మాతృభాష తెలుగును మరువొద్దని ఏ. కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై. స్వర్ణలత అన్నారు. ఈ మేరకు ఏ. కొత్తపల్లి హైస్కూల్‌లో గురువారం తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఒలింపిక్స్‌లో మూడు బంగారు పతకాలు సాధించి పద్మభూషణ్ అవార్డును ధ్యాన్ చంద్ సొంతం చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో ఆర్. శివప్రసాద్, కె. లావణ్య, ఎస్. రామకృష్ణ, పీడీ కె.సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : పలు పాఠశాలల్లో తెలుగుదనం ఉట్టిపడేలా బాల బాలికలు కట్టు,బొట్టుతో పాల్గొని పల్లె గ్రామీణ వాతావరణం ఉట్టిపడేలా వేషధారణ చేశారు. నేతవానిపాలెంలో అతిథి దేవోభవ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తెలుగు అచ్చులు,హల్లులు అక్షరాలతో తెలుగుభాష ప్రావీణ్యం గురించి ర్యాలీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు నాటికలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందించారు.

కె.కోటపాడు : తెలుగుభాషను వ్యవహారిక భాషగా గుర్తింపునకు కృషి చేసిన వ్యక్తి గిడుగు రామ్మూర్తి పంతులు అని మాజీ డీసీసీబీ డైరక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి అన్నారు. అయ్యన్న పాఠశాలలో గురువారం జరిగిన తెలుగుభాషా దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వ్యాసరచన, గేయాలు, పద్యాల పోటీల్లో విజేతలైన విద్యార్థులకు విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.ఖాసింతో కలిసి చల్లా సత్యనారాయణమూర్తి బహుమతులను అందించారు. కె.కోటపాడు హైస్కూల్లో హెచ్ఎం ఎస్.వి.పద్మావతి ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాల వద్ద నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయుడు మండలి మురళీకృష్ణ పాల్గొన్నారు.

మాడుగుల: తెలుగు భాషను గ్రాంధికం నుంచి వ్యవహారిక భాషలోకి మార్పు చేసిన తెలుగు వ్యవహారిక భాషా కోవిదుడు గిడుగు రామమూర్తి ఒక్కరేనని , బ్రయిట్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కె.శివశంకర్ అన్నారు. జేడీపేట యూపీ స్కూల్ హెచ్ఎం అప్పలనాయుడు అధ్యక్షతన గురువారం నిర్వహించిన తెలుగు భాష దినోత్సవంలో మాట్లాడారు. ఉపన్యాసాలు, పద్యపోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ కన్వీనర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పిరమిడ్ విన్యాసాలు

మాకవరపాలెం: తెలుగు భాషా దినోత్సవం, క్రీడా దినోత్సవాలను మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అవంతి ఇంజినీరింగ్ కళాశాల, కేజీబీవీ, ఇతర పాఠశాలల్లో గిడుగు రామ్మూర్తి పంతులు, ధ్యాన్ చంద్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు నిర్వహించిన పిరమిడ్ విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అవంతి కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు, కేజీబీవీ ఎస్‌వో త్రివేణి, తూటిపాల హెచ్ఎం రాము పాల్గొన్నారు.

రోలుగుంట : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాలుఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల అధ్వర్యంలో తెలుగు టీచర్లు, పీడీలు గురువారం ఘనంగా నిర్వహించారు.గిడుగు రామ్మూర్తి పంతులు, క్రీడా పితామహుడు ధ్యాన్‌చంద్ చిత్రపటాల వద్ద నివాళులు అర్పించారు.

నర్సీపట్నం : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ విభాగం ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షునిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు వ్యవహరించారు. ప్రాచీన గ్రంథాల్లో ఉన్న భాష కఠినంగా ఉండడం వల్ల అందరికీ అర్థం కాకుండా పోతాయని ప్రజలకు వాడక భాషలోనే ప్రజా పరిపాలనలోనూ, పుస్తకాలు, పరీక్షలు ఉండాలని గిడుగు రామమూర్తి పట్టుపట్టి సాధించారన్నారు. వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

చీడికాడ: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా చీడికాడ శాఖా గ్రంథాలయలో గ్రంథపాలకురాలు జోగేశ్వరి ఆధ్వర్యంలో గిడుగు రామూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు ఆర్పించారు. తెలుగు వ్యవహారిక భాషకు రామమూర్తి చేసిన సేవలను కొనియాడారు.

మాడుగుల రూరల్ : తెలుగు వ్యాహారిక భాషా పితామహుడు గిడుగు వెంకట రామూర్తి జయంతిని పురస్కరించుకుని, తెలుగు భాషా దినోత్సవం ముకుందపురం ఎంపీపీ పాఠశాలలో నిర్వహించారు. వడ్డాదికి చెందిన అతిథి దేవో భవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల ఆవరణలో గల తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు.పాఠశాల విద్యార్థులు పలకలు మీద తెలుగు అక్షరాలు రాసి వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు.హెచ్ఎం కె.సత్తిబాబు పాల్గొన్నారు.

చోడవరం రూరల్ : మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పలు పాఠశాలల్లో గురువారం తెలుగు భాష, క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్, తెలుగు విభాగం అధిపతి సిహెచ్.జ్యోతి ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటాన్ని ఆవిష్కరించి నివాళులు అర్పించారు. భాషోద్యమంలో గిడుగు పాత్రను విద్యార్థులను వివరించారు. లక్ష్మీపురం, గవరవరం ఉన్నత పాఠశాల, స్థానిక బాలికోన్నత పాఠశాలలతోపాటు అడ్డూరు ప్రాథమిక పాఠశాలల్లో తెలుగుభాష, క్రీడా దినోత్సవాలను జరిపారు. గిడుగు, ధ్యాన్‌చంద్ చిత్రపటాలను ఆవిష్కరించి ఘన నివాళులర్పించారు.

అందుబాటులో సంపూర్ణ పశుదాణా

మాడుగుల : రైతు సేవా కేంద్రాల్లో ప్రభుత్వ రాయితీలపై సంపూర్ణ మిశ్రమ దాణా అందుబాటులో ఉందని, ఏడీ వి చిట్టినాయుడు అన్నారు. గురువారం ఆయన మాడుగులలో విలేకరులతో మాట్లాడారు కేజీ మిశ్రమ దాణా రూ. 15.90పైసలు కాగా సబ్సిడీ రూ.9.40పైసలు పోగా రైతు వాటాగా రూ. 6.50 పైసలు చెల్లించాలన్నారు. చాప్‌కట్టర్లు యూనిట్ ఖరీదు రూ. 33,970 కాగా సబ్సిడీ రూ.13,588 పోను రైతులు రూ.20,382 చెల్లించాలన్నారు. తెల్లరేషన్ కార్డులున్న పాడి రైతుల పశువులకు ప్రభుత్వం అందజేస్తున్న పశు బీమా అందుబాటులో ఉందన్నారు. రూ.30 వేలకు బీమా పొందడానికి రూ. 398, 40 వేలుకు రూ.1061, అలాగే 50 వేలుకు రూ.1723, 60 వేలుకు 2, 385 పశు బీమా కొరకు రైతులు చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు తమ సమీపంలో ఉన్న రైతు సేవా కేంద్రాలను సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

మద్యంతో మహిళ...పేకాటలో జూదరుల అరెస్టు

చోడవరం రూరల్ : చోడవరం ఎస్ఐ ఎస్.సూర్యనారాయణ బృందం గురువారం జరిపిన వేర్వేరు దాడుల్లో అక్రమ మద్యం అమ్ముతూ మహిళ పట్టుబడగా, మరో గ్రామంలో పేకాట ఆడుతున్న బృందాన్ని దాడి చేసి పట్టుకున్నారు. దామునాపల్లి గ్రామంలో పలకా లక్ష్మి అనే మహిళను అరెస్టు చేసి ఆమె నుంచి 9 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని, అలాగే పేకాడుతున్న ఐదుగురిని పట్టుకుని వారి నుంచి 5,750 రూపాయలను సీజ్ చేశామని ఎస్ఐ సూర్యనారాయణ తెలిపారు.